www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 28 జూన్ 2025

5

కాకినాడ

4న జెఎన్‌టియుకె స్నాతకోత్సవం

ప్రజాశక్తి-కాకినాడ

జెఎన్‌టియుకె విశ్వవిద్యాలయ 11వ స్నాతకోత్సవం జూలై 4వ తేదీ శుక్రవారం అలూమ్ని ఆడిటోరియంలో నిర్వహించనున్నట్టు విసి ప్రొఫెసర్ సిఎస్‌ఆర్‌కె.ప్రసాద్ తెలిపారు. స్నాతకోత్సవం సందర్భంగా 2023-2024 విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేస్తారన్నారు. స్నాతకోత్సవం సందర్భంగా బి.టెక్, బి.ఫార్మసీ, ఎంటెక్, ఎంబిఎ, ఎంసిఎ, ఎం.ఫార్మసీ, బిబిపి, ఫార్మా-డి, బి.ఆర్క్ విద్యార్థులకు సంబంధిత డిగ్రీలను ప్రదానం చేస్తారని ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.రవీంద్రనాథ్ తెలిపారు. ఈ స్నాతకోత్సవంలో 99 మంది రీసెర్చ్ స్కాలర్స్ పిహెచ్ డిగ్రీలు అందుకోనున్నారన్నారు. 40 మంది విద్యార్థులకు అవార్డులు, బంగారు పతకాలు అందజేస్తారన్నారు.

ముంపు బారిన స్మార్ట్ సిటీ

- చిన్నపాటి వర్షానికే జలమయం
- సక్రమంగా లేని డ్రైనేజీ వ్యవస్థ
- శాశ్వత పరిష్కారం లేక అవస్థలు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

కాకినాడ స్మార్ట్ సిటీ సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. ప్రధానంగా ముంపు సమస్య తీవ్రంగా వేధిస్తోంది. ప్రస్తుతం వర్షాకాలం నేపథ్యంలో నగర వాసులు ఆందోళన చెందుతున్నారు. చిన్నపాటి వర్షం వస్తే చాలు నగరపాలక సంస్థలోని పలు డివిజన్లు పూర్తిగా జలమయం అవుతున్నాయి. రోజుల తరబడి నీరు బయటకు పోకుండా ఇళ్ల చుట్టూ చేరుకుంటోంది. ఖాళీ స్థలాలు, లోతట్టు ప్రాంతాల్లో బురద నీరు వారాల తరబడి నిలవ ఉంటోంది. దీంతో అనేకమంది రోగాల పాలవుతున్నారు. ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారాలు మార్గం చూపకపోవడంతో కొన్నేళ్లుగా కాకినాడ స్మార్ట్ సిటీ ప్రజలు తీవ్ర స్థాయిలో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా ప్రజల స్థితిగతుల్లో మాత్రం మార్పు రావడం లేదు.

50 డివిజన్లుగా విస్తరించి ఉన్న కాకినాడ నగరపాలక సంస్థ 31.69 చ.కిమీ విస్తీర్ణంలో ఉంది. ప్రస్తుతం సుమారు 5.5 లక్షల మంది జనాభా నివసిస్తున్నారు. ప్రణాళికాబద్ధంగా నిర్మించిన నగరంగా కాకినాడకు పేరుంది. ఇక్కడ సుమారు 101 మురికివాడలు ఉన్నాయి. 300 కిలోమీటర్ల మేర మురుగునీటి కాలువలు ఉన్నాయి. స్మార్ట్ సిటీగా ఎంపికవడంతో దాదాపు రూ.1000కోట్ల నిధులతో నగరంలో పలు ప్రాంతాలు బాగా అభివద్ధి చెందాయి. కొన్ని ప్రదేశాలు, పార్కులు సుందరవనంగా తీర్చిదిద్దారు. రోడ్లను బాగా విస్తరించడంతో ట్రాఫిక్ సమస్యకు చిక్కులు వీడాయి.

పట్టి పీడిస్తున్న ప్రధాన సమస్యలు

నగరంలో ప్రధానంగా ముంపు సమస్య ప్రజలను పట్టి పీడిస్తోంది. అభివద్ధి పేరుతో రోడ్లను ఎత్తు చేస్తున్నారే తప్ప డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరచడంలో పాలకులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం వర్షాకాలం సీజన్ ప్రారంభమైంది. మూడు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో మళ్లీ వర్షాకాలం సీజన్ ముందుకు రావడంతో ముంపు సమస్యతో ఇబ్బందులకు గురవ్వాలని నగరవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏటా 20 డివిజన్ల పరిధిలో ప్రజలు వరద నీటిలో నానా అవస్థలూ పడుతున్నారు. కొన్ని ఆవాసాల్లో పీకల్లోతు సైతం నీరు చేరడంతో బయటకు రాలేని పరిస్థితుల్లో ఇబ్బందులు పడుతున్నారు. రేచర్ల పేట, సాంబమూర్తినగర్, పర్లోపేట, దుమ్ములపేట, సంజయ్ నగర్, ఏటిమొగ, రామకృష్ణారావుపేట, వెంకటేశ్వర కాలనీ, కచేరిపేట, గొల్లపేట, టీచర్స్ కాలనీ, ట్రెజరీ కాలనీ, ఎస్.అచ్యుతాపురం, మహాలక్ష్మినగర్, లక్ష్మీనగర్, వెంకట్ నగర్, గొడారిగుంట ఇలా పలు ప్రాంతాల్లో జనమంతా వర్షాకాలంలో ముంపులోనే జీవనం సాగిస్తున్నారు.

పట్టించుకోని యంత్రాంగం

ముంపు బెడద తీర్చే ప్రణాళికలు పూర్తిస్థాయిలో లేకపోవడంతో సమస్యలు నెలకొంటున్నాయి. చీడీలపోర పిడబ్ల్యాడి కాలువల పునరుద్ధరణ నేటికీ జరగలేదు. వీటి స్థలాల్లో రాజకీయ నాయకులు అండదండలతో పలువురు ఆక్రమణలకు పాల్పడ్డారు. దీంతో అధికారులు వాటి జోలికి పోవడం లేదని విమర్శలు నగర ప్రజల నుంచి వెల్లువెత్తుతున్నాయి. రైల్వే శాఖ స్థలంలో రేచర్ల పేట రైల్వే గేటు నుంచి పోర్టు స్టేషన్ వరకు రూ.కోట్లు వెచ్చించి డ్రైన్ నిర్మించారు. నగరపాలక సంస్థ అధికారులు చేతులెత్తేయడంతో రైల్వే డ్రైన్ నిర్వాహణను గాలికొదిలేశారు. దీంతో తూర్పు వైపు నుండి పడమర వైపుకు డ్రెయిన్లు తిరిగి నిర్మించారు.

జగన్నాథపురం ఎంఎస్ఎన్ చార్టీస్ రోడ్డులోని బాలయోగి విగ్రహం జంక్షన్ నుంచి మహాలక్ష్మి నగర్ మీదుగా సముద్ర తీర ప్రాంతానికి మేజర్ డ్రైన్ నిర్మించకపోవడం ముంపు సమస్య తీవ్రతరం అవుతోంది. ఇంత జరుగుతున్నా అధికార యంత్రాంగం కనీసం ఆక్రమణల వ్యవహారం తేల్చడంలో తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. లంచాలకు అలవాటు పడి నగరపాలక సంస్థ అధికారులు ఈ విషయంపై పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నారని పలువురు నగరవాసులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో తక్షణమే అధికారులు స్పందించి ముంపు సమస్యకు పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో స్థానిక ఎంఎల్ఎ వనమాడి కొండబాబు ఈ సమస్యపై ప్రత్యేక చొరవ తీసుకుని నిధులను కేటాయించి డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదలకు కషి చేయాలని కోరుతున్నారు.

కూటమి ప్రభుత్వంపై వైసిపి ధ్వజం

ప్రజాశక్తి-కాకినాడ

ప్రతి వైసిపి కార్యకర్తా ప్రజల వద్దకు వెళ్లి బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీపై ఇంటింటికీ వెళ్లి సిఎం చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు వివరించాలని పార్టీ ఉభయ గోదావరి జిల్లాల కో-ఆర్డినేటర్, ఎంఎల్‌సి బొత్స సత్యనారాయణ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం కాకినాడ సూర్య కళామందిరంలో మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా శుక్రవారం నిర్వహించిన పార్టీ విస్తత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం తప్పుడు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. ఆ హామీలు అమలు అరకొరగానే చేస్తోందని బొత్స ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వ హయాంలో ఎన్నో సంక్షేమ పథకాలను వైఎస్ జగన్ అర్హులకు అందించి ప్రజామన్ననలను పొందారన్నారు. రానున్న కాలంలో వైసిపి శ్రేణులు కూటమి ప్రభుత్వ అరాచకాలను ధైర్యంగా ఎదుర్కోవాలని బొత్స పిలుపునిచ్చారు. ఎలాంటి కేసులు పెట్టినా వైసిపి నాయకులు కార్యకర్తలు భయపడే ప్రసక్తే లేదని బొత్స తేల్చి చెప్పారు. అనంతరం ఆయా నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలతో కలిసి బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ క్యూఆర్ కోడ్‌ను విడుదల చేశారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి కురసాల కన్నబాబు, మాజీ ఎంపీలు వంగా గీత, తోట నరసింహం, మాజీ ఎంఎలఎలు ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, జ్యోతుల చంటిబాబు, పార్లమెంట్ ఇన్‌ఛార్జి సూర్యనారాయణ రాజు, ఎంఎల్సిఇ అనంత ఉదయ భాస్కర్, జెడ్‌పి చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్, వైసిపి నాయకులు యనమల కృష్ణుడు, దవులూరు దొరబాబు, మహిళ నాయకురాలు లక్ష్మీ శివకుమారి, ముదునూరి మురళీ కృష్ణంరాజు, వైసిపి శ్రేణులు పాల్గొన్నారు.

క్యూఆర్ కోడ్ విడుదల చేస్తున్న వైసిపి నాయకులు

బిసిల అభివృద్ధి టిడిపితోనే సాధ్యం

ప్రజాశక్తి-తుని

బిసిల అభివృద్ధి టిడిపితోనే సాధ్యమని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శుక్రవారం తుని పట్టణం ఆమోజీపేటలో దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాన్ని మంత్రి సుభాష్, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడుతో కలిపి ఆవిష్కరించారు. అనంతరం శెట్టిబలిజ ఆత్మీయ సమ్మేళన సభ సాయి వేదికలో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యమని, రానున్న రోజుల్లో సంక్షేమ బోర్డు ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పాలిక శ్రీను, రంగాల మల్లేశ్వరరావు, పెంకే గోవిందు, పెంకే శ్రీను, వాసంశెట్టి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

తాగునీరు, పారిశుధ్యంపై నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి-కాజులూరు

గ్రామాలలో తాగునీరు, పారిశుధ్యంపై అధికారులు నిర్లక్ష్యం వహించరాదని ఎంపిడిఒ జె.రాంబాబు అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన కాజులూరు, చేదువాడ, గొల్లపాలెంలో పారిశుధ్యంపై అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం ఎంపిడిఒ మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్యంపై అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా నిరంతరం పరిశీలించి తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గొల్లపాలెంలో డ్రైనేజీలలో సిల్ట్‌ను జెసిబి సాయంతో తొలగిస్తామన్నారు. గుంతల్లో ఉన్న నీటిని ఎప్పటికప్పుడు తొలగించేలా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంపద కేంద్రాలలో తడి చెత్త నుండి ఎరువులను తయారు చేసేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ సిబ్బంది ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కె.ఈశ్వరి, రవి ప్రసాద్ పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న సిబ్బంది

2న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-కాకినాడ

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జూలై 2వ తేదీన ఉదయం 10.30 గంటల నుంచి నిర్వహిస్తామని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ సిఇఒ వివిఎస్.లక్ష్మణ రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీరాజ్ చట్టంలోని నిబంధనలకు లోబడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జూలై 2వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి నిర్వహించనున్నామని సిఇఒ తెలిపారు. సమావేశానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరవ్వాలని కోరారు.

అన్నదానానికి దాతల సాయం

ప్రజాశక్తి - తాళ్లరేవు

లయన్స్ క్లబ్ నిర్వహిస్తున్న ఉచిత అననదానం పథకానికి పలువురు దాతలు సహకారం అందిస్తున్నారు. శుక్రవారం పి.మల్లవరం పంచాయతీకి చెందిన రిటైర్డ్ పోస్ట్ మాస్టర్ ధూళిపూడి సుబ్బారావు తన తండ్రి ధూళిపూడి సుబ్బారాయుడు జ్ఞాపకార్థం భోజనంతో పాటు, మామిడిపండ్లు, సబ్బులు, టూత్ పేస్టులు అందజేశారు. లయన్స్ క్లబ్ నిర్వహిస్తున్న ఉచిత అభాగ్యుల భోజనం క్యారేజీ పథకం ప్రారంభించి నేటికి 910వ రోజుకు చేరుకుందని క్లబ్ అధ్యక్షులు పొన్నాడ పేరయ్య రాజు తెలిపారు. ఈ పథకానికి సహకరిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఉంగరాల వెంకటేశ్వరరావు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు బిళ్లకుర్తి శ్రీనివాసరెడ్డి, నున్న దత్తు, చోడే శ్రీనివాసరావు, గాదిరాజు సతీష్ రాజు, కట్టా ఆదినారాయణ, పెయ్యల బాలయోగి పాల్గొన్నారు.

కార్టూ'నిజం'

పాలన వదిలేసి కక్ష సాధింపులు

52వ రోజుకు ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - పెద్దాపురం

తమ సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం 52వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న సమ్మె శిబిరంలో ఇంజినీరింగ్ కార్మికులు నిరసన తెలుపుతూ నినాదాలు చేశారు. సంఘం అధ్యక్షుడు సుంకర నాగేశ్వరరావు మాట్లాడుతూ 52 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయమన్నారు. టెక్నికల్ సిబ్బందికి రూ.29,200 నాన్ టెక్నికల్ సిబ్బందికి రూ 24,500 వేతనంగా ఇవ్వాలన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, విధి నిర్వహణలో చనిపోయిన కార్మిక కుటుంబానికి రూ 10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. బాసిన భద్రరావు, ఆకుల రామకృష్ణ, వాకాడ భాస్కర్, సుంకర సత్తిరాజు, మల్లిపెద్ది భద్రరావు, బొమ్మన రవికుమార్, అయ్యప్ప స్వామి, పూల ప్రశాంత్ పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ఇంజినీరింగ్ కార్మికులు

సమస్యల పరిష్కారానికి కృషి : ఎంఎల్‌ఎ నానాజీ

ప్రజాశక్తి -కరప

రూరల్ నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, ప్రజలకు, రైతులకు సంబంధిత శాఖ అధికారులు అందుబాటులో ఉండాలని ఎంఎల్‌ఎ పంతం నానాజీ అధికారులను ఆదేశించారు. మండల సమావేశ మందిరంలో ఎంపిపి పెంకే శ్రీలక్ష్మీ సత్తిబాబు అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సాధారణ సమావేశంలో ఎంఎల్‌ఎ నానాజీ పాల్గొని శాఖల వారీగా సంబంధిత అధికారులతో సమీక్షించారు. మౌలిక వసతులు కల్పించాలని, రైతులకు ఎల్లప్పుడు అధికారులు అందుబాటులో ఉంటూ రైతులకు సలహాలు, సూచనలు అందజేయాలన్నారు. అనంతరం ఆరట్లకట్ట గ్రామానికి చెందిన కురికూరి సాయి రామ్‌కు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును రూ.2,78,742 అందచేశారు. తహశీల్దార్ ఎన్.సత్యనారాయణ, ఎంఇఒ బి.కృష్ణవేణి, సూపరింటెండెంట్ బిఎల్.నరసింహం, ఇఒపిఆర్‌డి పి.శ్రీనివాసరావు, అధికారులు, కార్యదర్శులు, పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ఇంజినీరింగ్ కార్మికులు

28న పంచాయతీ కార్యదర్శుల సెలవు

ప్రజాశక్తి - పెద్దాపురం, తాళ్లరేవు

తమ సమస్యలు పరిష్కరించాలని, పని ఒత్తిడి తగ్గించాలని కోరుతూ ఈ నెల 28న కాకినాడ కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేస్తున్నందున ఆరోజు తమకు సామూహిక సెలవు ఇవ్వాలని పెద్దాపురం మండల పంచాయితీ కార్యదర్శులు శుక్రవారం మండల కార్యాలయ ఎఒ ఎం.సత్యనారాయణమూర్తికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ తాము గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీరు వంటి అత్యవసర విధులు నిర్వహిస్తున్నామన్నారు. వీటితో పాటు జిఎస్ డబ్ల్యుఎస్ సర్వేలు సచివాలయ సిబ్బందితో చేయిస్తూ వారిపై పర్యవేక్షణ బాధ్యత వహిస్తూ, పింఛన్ల పంపిణీ చేయిస్తూ సేవలందిస్తున్నామన్నారు. ఇతర శాఖల కార్యక్రమాలకు అనుసంధానకర్తగా వ్యవహరిస్తున్నామన్నారు. ఐవిఆర్‌ఎస్ కాల్స్‌కు తమను బాధ్యులను చేయడం అన్యాయమన్నారు. తమకు పని ఒత్తిడి తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. సంఘం నాయకులు రమణ, భార్గవ, శిరీష, ఈశ్వర్, సుభాని, తులసి పాల్గొన్నారు.

తాళ్లరేవులో ఎంపిడిఒతో మాట్లాడుతున్న కార్య దర్శులు

తాళ్లరేవు మండల కార్యాలయంలో మండల పంచాయతీ కార్యదర్శులు, ఎంపిడిఒ సత్యనారాయణకు తెలిపారు.

పెద్దాపురం ఆర్‌డిఒ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు

ఆదిత్యలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం విజయవంతం

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీలో జూన్ 23 నుంచి జూన్ 27 వరకూ అధునాతన కమ్యూనికేషన్‌లు అనే అంశంపై నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం విజయవంతంగా ముగిసిందని డిప్యూటీ ప్రో ఛాన్సలర్. డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఎన్‌ఐటి వరంగల్, జెఎన్‌టియు సంయుక్తంగా నిర్వహించగా, భారత ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ స్పాన్సర్ చేసింది. ముగింపు కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్.రమాశ్రీ మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగాన్ని అభినందించారు. కార్యక్రమ కో-కోఆర్డినేటర్ డాక్టర్ ఉప్పాడ రాజ్యలక్ష్మి, ప్రో ఛాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాస రెడ్డి, వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎంబి.శ్రీనివాస్, రిజిస్ట్రార్ డాక్టర్ జి.సురేష్, పరిశోధన విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన

ప్రజాశక్తి-గండేపల్లి

మండలంలో ప్రతి గ్రామంలో తడి చెత్త, పొడి చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపిడిఒ చంద్రరావు అన్నారు. దీనిలో భాగంగా మురారి గ్రామంలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పోతుల శిరీష, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు, కళాశాల సిబ్బంది

డ్రగ్స్ అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి-కాకినాడ

సజ్జన్ సమాజ్ ఇంటర్నేషనల్ యూత్ ఫోర్స్, ఈగల్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కాకినాడలోని ఐడియల్ డిగ్రీ కాలేజ్ విద్యార్థులకు డ్రగ్ అనర్థాలపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈగిల్ విభాగం, సబ్ ఇన్‌స్పెక్టర్ నరేశ్ కుమార్ డ్రగ్స్ వల్ల అనర్థాలు, చట్టపరమైన పరిణామాల గురించి విద్యార్థులకు వివరించారు. యువత నేరాల నుంచి దూరంగా ఉండాలని, తమ భవిష్యత్తును కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఎవరైనా డ్రగ్స్ వాడినా లేక అమ్మినా 14446 లేదా 1972 టోల్‌ఫ్రీ నెంబర్లకు కాల్ చేయాలని సూచించారు. సజ్జన్ సమాజ్ ఇంటర్నేషనల్ కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ సుమయ్య రుషీకా మాట్లాడుతూ యోగా, ధ్యానం ద్వారా ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కొనవచ్చని సూచించారు. యువత తాము ఎదుర్కొనే ఒత్తిడిని మానసికంగా నియంత్రించుకోవడం కోసం రోజూ కొన్ని నిమిషాలు ధ్యానం చేసేందుకు అలవాటు చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ టి.సత్యనారాయణ, ఐడియల్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్, వైఆర్‌సి.చౌదరి, ఎన్‌ఎస్-ఎస్ కో ఆర్డినేటర్, ఈగిల్ పోలీస్ టీమ్ సభ్యులు, సజ్జన్ సమాజ్ ఇంటర్నేషనల్ యువజన విభాగానికి చెందిన పవని, అర్జున్, రకీబ్, రాజేష్, బాషా పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్యశాఖ బదిలీల్లో అక్రమాలు

ప్రజాశక్తి-కాకినాడ

వైద్య ఆరోగ్యశాఖలో ఇటీవల చేపట్టిన బదిలీలలో పలు అవకతవకలు జరిగాయని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డి.ఎ.రత్నరాజు శుక్రారం ప్రకటనలో పేర్కొన్నారు. జిఒ నెంబర్ 23 నిబంధనలను తప్పుదోవ పట్టిస్తూ సీనియర్ అసిస్టెంట్ల బదిలీ నిర్వహించారన్నారు. జిఒ నెంబర్ 23 క్లాజు 5 ప్రకారం ఉమ్మడి జిల్లాను ఒక యూనిట్‌గా పరిగణించి మూడేళ్లు నిండిన సీనియర్ అసిస్టెంట్ల బదిలీ ప్రక్రియ చేపట్టాలన్నారు. ఆర్‌డి కార్యాలయంలో పని చేస్తూ మూడేళ్లు ఒకే చోట పని చేసిన ఎన్.సాయి చిన్నారావు, జగదీష్, మరో చోట పని చేస్తున్న మూర్తిని బదిలీ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు చేస్తామన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా బదిలీలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని రత్నరాజు డిమాండ్ చేశారు.

పెయింటింగ్ వర్కర్స్‌కు అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణ పరిధిలోని పాండవ గిరి పెయింటింగ్ వర్కర్స్ యూనియన్, మరిడమ్మ తల్లి పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ సభ్యులకు శుక్రవారం బిర్లా ఓప్స్ ఆఫీసర్ జగదీష్ అవగాహన కల్పించారు. స్థానిక వికాస్ పెయింట్స్ షాపు వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో జగదీష్ మాట్లాడుతూ బిర్లా ఓప్స్ పెయింట్స్ నాణ్యతపై అవగాహన కల్పించారు. అనంతరం కార్మికులకు డిన్నర్ బాక్సులు, టీ షర్టులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఏజెంట్ అనిల్, డీలర్ శివ, వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వడ్డి సత్యనారాయణ, ఆదిరెడ్డి కృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఘన సత్కారం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక కబాడీ వీధి మాస్టర్ ట్యూషన్ సెంటర్‌లో శిక్షణ పొంది ట్రిపుల్ ఐటి, ఎన్‌ఎంఎంఎస్, నవోదయకు ఎంపికైన విద్యార్థులను శుక్రవారం వత్సవాయి భవనంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. అనంతరం సూరిబాబు రాజు మాట్లాడుతూ ప్రతి ఏడాదీ మాస్టర్ ట్యూషన్ సెంటర్లో శిక్షణ పొందిన విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించడం అభినందనీయమన్నారు. మంచి శిక్షణతో పాటు ఇంగ్లీషులో విశేష ప్రవీణ్యం సంపాదించేలా విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో రఫీ మాస్టర్, షఫీ మాస్టర్, మన పెద్దాపురం ఫేస్బుక్ అడ్మిన్ పెద్దిరెడ్డి నరేష్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మల్లిశాల ఫిషర్‌మెన్ సొసైటీ చైర్మన్‌గా రాజు

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని మల్లిసాల ఫిషర్‌మెన్ సొసైటీ చైర్మన్‌గా ఇంజరపు రాజు, సెక్రటరీగా గాలింకల భీమరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం సంఘం సభ్యులు చైర్మన్‌తో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. వారు టిడిపి కాకినాడ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్‌ను స్థానిక నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సంధర్భంగా వారిని శాలువాలు పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు, టిడిపి నాయకులు మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, పైడిపాల సూరిబాబు, బుర్రి సత్తిబాబు, సర్వసిద్ధి లక్ష్మణరావు, తొట్టిపూడి నాగేశ్వరరావు, బస్వా చినబాబు, వేములకొండ జోగారావు పాల్గొన్నారు.

అక్షరాస్యతతోనే రాష్ట్ర అభివృద్ధి

ప్రజాశక్తి-ఏలేశ్వరం

సంపూర్ణ అక్షరాస్యతతోనే రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని ప్రత్తిపాడు ఎంఎల్‌ఎ వరుపుల సత్యప్రభ అన్నారు. ఆమె శుక్రవారం ఎర్రవరం హైస్కూల్లో అదనపు తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎర్రవరంతో పాటు మండలంలో పేరవరం, సి.రాయవరం, తూర్పు లక్ష్మీపురం, గ్రామాల యూపీ పాఠశాలలను హైస్కూల్స్‌గా అభివృద్ధి చేసినట్టు తెలిపారు. విద్యార్థులందరికీ తల్లికి వందనం ఇవ్వడంతో పాటు సన్న బియ్యంతో విద్యార్థులకు ఆహారం అందజేస్తున్నామన్నారు. త్వరలోనే డిఎస్‌సి ప్రక్రియను పూర్తి చేసి ఉపాధ్యాయుల కొరత లేకుండా చూస్తామన్నారు. అనంతరం విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు, యూనిఫామ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గొల్లపల్లి బుజ్జి, జెడ్‌పిటిసి నీరుకొండ రామకుమారి, కూటమి నాయకులు బొద్దిరెడ్డి గోపి, బస ప్రసాద్, చిక్కాల లక్ష్మణరావు, మేడిశెట్టి బాబి, సింగిలిదేవి సత్తిరాజు, ఎంఇఒ బి.అబ్బాయి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

డ్రంక్ అండ్ డ్రైవ్‌పై 11 మందికి జరిమానా

ప్రజాశక్తి-తుని

తుని పట్టణంలో శుక్రవారం సిఐ ఎం.గీతా రామకృష్ణ డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించగా 11 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లుగా గుర్తించి వీరిని అరెస్ట్ చేసి తుని కోర్టుకు తరలించినట్టు తెలిపారు. ఫస్ట్ క్లాస్ జ్యూడీషియల్ కోర్టు జడ్జి వీరికి ఒక్కొక్కరికీ రూ.10,000 వేల చొప్పున 11 మందికి 1,10,000 కోర్టు జరిమానా విధించారు. మద్యం తాగి వాహనాలు డ్రైవింగ్ చేస్తూ విలువైన ప్రాణాలను పోగొట్టుకోవద్దని, ప్రజలకు అవగాహన కల్పించారు.

తప్పి పోయిన మహిళ ఆచూకీ

ప్రజాశక్తి - జగ్గంపేట

గంటల వ్యవధిలోనే తప్పిపోయిన మహిళ ఆచూకీని కనుగొన్నారు జగ్గంపేట పోలీసులు. స్థానిక నెహ్రూ కాలనీకి చెందిన ఒక మహిళ ఇంటిలో వారిపై కోపగించి శుక్రవారం బయటకు వెళ్లిపోయింది. సాయంత్రం 6 గంటల సమయంలో బంధువులు జగ్గంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే పోలీసులు స్పందించి నాలుగు టీములను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. ఆమె ఆచూకీ కనుగొని ఆమెకు కౌన్సిలింగ్ ఇచ్చారు. రాత్రి 9 గంటలకు తల్లిదండ్రులకు అప్పగించారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్ వలీకి ఘన సత్కారం

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా ఇటీవల నియమితులైన షేక్ వలీ జామియా మసీదు కమిటీ శుక్రవారం ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా జిల్లా వర్క్ బోర్డ్ మాజీ చైర్మన్ గపూర్ మాట్లాడుతూ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా గుర్రంపాలెం గ్రామానికి చెందిన వల్లిని నియమించడంతో కమిటీ ఆధ్వర్యంలో సన్మానించినట్టు తెలిపారు. ముస్లిములను గుర్తించి అవకాశం కల్పించిన ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ, టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జామియా మసీదు కమిటీ ప్రెసిడెంట్ ఆరిఫ్, చిన్న ఖాజా, పెద్ద ఖాజా, ఎండి బాషా, షేక్ సలీం, సయ్యద్ బాజీ, ఎస్‌కె.రెహమాన్, మసీదు కమిటీ సభ్యులందరూ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలోని వడ్లమూరు, జి.రాగంపేట గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను శుక్రవారం తహశీల్దారు సిహెచ్.వెంకటలక్ష్మి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి ప్రస్తుత నియమ నిబంధనల ప్రకారం పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓటర్ల సంఖ్య, పోలింగ్ స్టేషన్ స్థితిగతులు ఆమె పరిశీలించారు. పెద్దాపురం మండలం, పట్టణ పరిధిలో ప్రస్తుత ఓటర్ల సంఖ్యను దృష్టిలో పెట్టుకుని పోలింగ్ బూత్‌లు పెరిగే అవకాశం ఉందన్నారు. గతంలో పోలింగ్ స్టేషన్లు నిర్వహించి ప్రస్తుతం అనుకూలంగా లేని పోలింగ్ స్టేషన్ల స్థానే మరో చోటికి పోలింగ్ స్టేషన్లు మార్పు చేసే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జి.రాగంపేట విఆర్ఒ వెంకటేశ్వరరావు, వడ్లమూరు విఆర్ఒ అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతుల నవీన్‌ను కలిసిన ఎడిఎ

ప్రజాశక్తి - జగ్గంపేట

టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌ను వ్యవసాయ శాఖ ఎడి గరిమెళ్ళ శ్రీనివాస్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈయన స్థానిక సహాయ సంచలకునిగా బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో అల్లూరి సీతారామరాజు జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఎపిడిగా పని చేసినట్టు తెలిపారు. ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ సహకారంతో రైతులకు సకాలంలో వ్యవసాయ శాఖ నుంచి వచ్చే అన్ని ప్రయోజనాలూ కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు, అధికారులు రెడ్ల శ్రీరామ్, నరసింహం ఉన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-తాళ్ళరేవు

ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని పలు పంచాయతీల్లో పారిశుధ్య పనులు వేగంగా చేస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించడంతోపాటు, రహదారులకు ఇరువైపులా ఉన్న చెత్తను, తుప్పలను తొలగిస్తున్నారు. శుక్రవారం కోరంగి పంచాయతీ పరిధిలో జాతీయ రహదారి 216 చెంతన ఉన్న తుప్పలను తొలగించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, విజె.వి.రమణ పాల్గొన్నారు.

హెలెన్ కెల్లర్ సేవలు ఆదర్శనీయం

ప్రజాశక్తి- తాళ్లరేవు

చెవిటి, మూగ, అంధుల కోసం ప్రత్యేక స్పర్శ భాషను కనిపెట్టి అనేక పాఠశాలలు స్థాపించిన హెలెన్ కెల్లర్ పుట్టినరోజు వేడుకలను సీతారామపురంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ధీరూబాయ్ అంబానీ ఎర్లీ ఇంటర్‌వెన్షన్ కేంద్రంలో హెలెన్ కెల్లర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కేంద్రం నిర్వాహకులు గోపాల్, ఉపాధ్యాయురాలు ఉదయ కుమారి మాట్లాడారు. బహుళ వైకల్యం కలిగిన చిన్నారులు స్పర్శ ద్వారా విద్యను ఎలా నేర్చుకోవాలి అనే విషయాలపై అనేక రచనలు చేసి, వికలాంగుల ఉద్యమాల సారథిగా, పలువురికి మార్గదర్శిగా నిలిచిన హెలెన్ కిల్లర్ సేవలు ఆదర్శనీయమని అన్నారు. వైద్యులు శ్రీకాంత్, సత్తిబాబు, రిలయన్స్ ప్రతినిధులు జి.సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-కోటనందూరు

జులై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు కార్యదర్శి ఎస్‌కె.పద్మ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక తహశీల్దారు టి.సుభాష్‌కు ఎంపిడిఒ పి.వెంకటనారాయణకు, ఎంఇఒ ఎ.శ్రీనివాస్‌కు సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని, పెరిగిన నిత్యావసర వస్తువు ధరలను తగ్గించాలని, కార్మికుల వేతనాలను, ఉపాధి రోజువారి కూలీ ధరలు పెంచాలని అన్నారు. భవన కార్మికులకు సంక్షేమ బోర్డును పునరుద్ధించి మరణించిన,గాయపడిన కార్మికులకు సంక్షేమ నిధులను విడుదల చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భవన కార్మికుల, ప్రజాసంఘాల సంఘ నాయకులు తదితరులుపాల్గొన్నారు.

యానాం వార్తలు

నేడు ఖాతాదారులకు సమావేశం

ప్రజాశక్తి - యానాం

యానాంలోని ది సిటిజన్ కో-ఆపరేటీవ్ సొసైటీ లిమిటెడ్ బ్యాంకులో శనివారం ఖాతాదారుల సమావేశం నిర్వహించనున్నట్లు స్థానిక బ్రాంచి మేనేజర్ కాశి అశోక్ కుమార్ శుక్రవారం తెలిపారు. ఉదయం పది గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి ఖాతాదారులు, శ్రేయోభిలాషులు అందరూ పాల్గొని సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సొసైటీ డైరెక్టర్లు పాల్గొంటారని మేనేజర్ తెలిపారు.

హెలెన్ కెల్లర్‌కు నివాళులర్పిస్తున్న సిబ్బంది, తల్లిదండ్రులు

ఘనంగా హెలెన్ కెల్లర్ 145వ జయంతి

ప్రజాశక్తి - యానాం

హెలెన్ కెల్లర్ 145వ జయంతిని సెంటర్ ఇన్‌ఛార్జి కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక బీచ్ రోడ్డులో ఉన్న ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ మానసిక వికలాంగుల ప్రత్యేక పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ సహదేవరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెలెన్ కెల్లర్ తన జీవితాంతం వికలాంగుల సమస్యలపై నిరంతరం పోరాడారని అన్నారు. ఆమె స్ఫూర్తితో హక్కులను పరిరక్షించుకునేందుకు నిరంతరం పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ముందుగా హెలెన్ కెల్లర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు ఎన్.వీరాస్వామి, ఫిజియోథెరపిస్ట్ విజయ దుర్గ, ప్రత్యేక ఉపాధ్యాయులు ఎం.సుశీల, డి.వీరవేణి, ఎం.గీత, తాతారావు పాల్గొన్నారు.

బిజెపి మంత్రి, ముగ్గురు ఎంఎల్‌ఎల రాజీనామా

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ఆది ద్రావిడ సంక్షేమ శాఖ బిజెపి మంత్రి ఎకెజె.సాయి శర్వానన్ కుమార్ తన మంత్రి పదవికి శుక్రవారం రాజీనామా చేసారు. రాజీనామా పత్రాన్ని ముఖ్యమంత్రి రంగసామికి తన కార్యాలయంలో అందించారు. బిజెపి అధిష్టానం ఆదేశాల మేరకు తన మంత్రి పదవికి రాజీనామా చేసినట్లు మంత్రి వెల్లడించారు. ముగ్గురు నామినేటెడ్ బిజెపి ఎంఎల్ఎలు అశోక్ బాబు, రామలింగం, వెంకటేశం తమ పదవులకు రాజీనామా చేశారు. రాజీనామా లేఖను గవర్నర్ ఆమోదించినట్లు సిఎం రంగసామి తెలిపారు. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వరుస రాజీనామాలతో పుదుచ్చేరి రాజకీయం వేడెక్కింది.

విద్యా మిత్ర కిట్లను పారదర్శకంగా అందజేయాలి

ప్రజాశక్తి - ఆలమూరు

విద్యార్థులకు పంపిణీ చేసే కిట్లను పారదర్శకంగా అందజేయాలని జిల్లా అబ్జర్వర్ అబ్దుల్ ఘని అన్నారు. 2025 - 26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రభుత్వం తరపున అందించనున్న సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. మండలంలోని కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని స్టాక్ పాయింట్ వద్ద సిఎమ్ఒ సుబ్రహ్మణ్యంతో కలిసి విద్యార్థులకు యూనిఫామ్, బూట్లు నాణ్యతను పరీక్షించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. మండల విద్యాశాఖ అధికారులు బి.అప్పాజీ, పి.సుబ్బరాజు, సిఆర్ఎంటిలు, పార్ట్ టైం ఇనెస్పెక్టర్లకు పలు సూచనలు జిల్లా అబ్జర్వర్ అబ్దుల్ ఘని అందజేశారు.

పోస్ట్ ఆఫీస్ వీధి దుస్థితి

రోడ్డు ఇలా.. నడిచేదెలా..
బురదమయంగా పోస్ట్ ఆఫీస్ వీధి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండల కేంద్రం ఆత్రేయపురం బండారు కాలనీకి వెళ్లే ప్రధాన మార్గం పోస్ట్ ఆఫీస్ వీధికి ఏళ్ల తరబడి సమస్య ఉన్న మోక్షం కలగడం లేదు. వర్షం వస్తే చాలు బురదమయంగా మారడంతో ప్రజలు ఈ రోడ్లో ప్రయాణించాలంటే నానా అవస్థలు పడుతున్నారు. ప్రతి సంవత్సరం వర్షాకాలం వస్తే ఈ రోడ్డు దుస్థితి ఇంతే కొద్దిపాటి వర్షానికి బురదమయిందా మారి చుక్కనీరు కూడా ముందుకెళ్లే దారి లేక బండారు కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు ఈ రోడ్లో డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో కొద్దిపాటి వర్షానికి రోడ్డు చెరువును తలపిస్తోంది. దీనికి తోడు మురుగునీరు రోడ్లపైకి చేరడంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఉపాధి హామీ నిధులు రూ.20 లక్షలతో రోడ్డు నిర్మించేందుకు ఇటీవల ఎంఎల్ఎ బండారు సత్యానంద రావు శంకుస్థాపన చేశారు.

100 రోజుల ఉపాధి పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

ఉపాధి కూలీలు వంద రోజులు పని పూర్తి చేసుకొని వారి జీవనోపాధిని మెరుగు పరుచుకోవాలని ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీ డైరెక్టర్ జి.శ్రీకాంత్ అన్నారు. డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ సూచన మేరకు శుక్రవారం గొర్స గ్రామంలో సామాజిక తనిఖీ బందం ఇన్ఫర్మేషన్ ఎడ్యుకేషన్ కమ్యూనికేషన్ ద్వారా గ్రామస్థాయిలో ఉపాధి వేతన దారులకు ఉపాధి హామీ పథకం యొక్క హక్కుల, సౌకర్యాల గురించి రాజీ లేని అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు అవగాహన కలిపేందుకు ఉపాధి కూలీలు, గ్రామ పెద్దలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో అవగాహన కల్పించారు. అనంతరం మాట్లాడుతూ ఉపాధి పనులు 100 రోజులు పూర్తి చేసుకొని వారి జీవనోపాధిని మెరుగు పరుచుకోవాలని సూచించారు. సామాజిక, వనరుల పటం ద్వారా ఏ పనులు నిర్వహించారు, మిగిలిన పనులు ఏమున్నాయి దానిపై వివరించారు. ఈ కార్యక్రమంలో సోషల్ ఆడిట్ డైరెక్టర్ జి.శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

దళితులకు అన్యాయం చేస్తున్న రేవంత్, చంద్రబాబు

ప్రజాశక్తి-తుని

మాలలను టార్గెట్ చేస్తూ కుట్ర పన్నుతున్న తెలుగు రాష్ట్ర ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ రెడ్డి రానున్న రోజుల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని మాలమహానాడు అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్.రత్నాకర్ హెచ్చరించారు. శుక్రవారం తునిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితుల ఓట్లతో ఆంధ్రాలో చంద్రబాబు, తెలంగాణలో రేవంత్ రెడ్డి అధికారం చేపట్టి దళితులకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. దేశంలో ఎస్‌సి వర్గీకరణకు ఏ రాష్ట్రంలోనూ చట్టబద్ధత లేదన్నారు. తొలిసారి ఎస్‌సి వర్గీకరణ మొదలు పెట్టిన పంజాబ్, హర్యానా రాష్ట్ర ముఖ్యమంత్రులకు లేని తొందర తెలుగు రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులకు ఎందుకని ఆయన ప్రశ్నించారు. ఒక కులాన్ని ఒక వర్గాన్ని టార్గెట్ చేస్తూ పరిపాలన సాగించడం ప్రజాస్వామ్యంలో సరైన విధానం కాదన్నారు. ఈ సమావేశంలో కొండ్రు కల్యాణ్, నెల్లి సూరిబాబు, కనికెళ్ల నానిబాబు, కొప్పుల ప్రేమ్ బాబు, బల్ల సత్యనారాయణ, గంట మోహన్ రావు, మారే సత్యనారాయణ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటికి ప్రభుత్వ పాఠశాల విద్యార్థి

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ట్రిపుల్ ఐటికి ఏలేశ్వరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి కోణాల వెంకట పథ్వీ నాయుడు ఎంపికైనట్టు హెచ్ఎం లక్ష్మీ తులసి తెలిపారు. ఈ మేరకు ఆమె విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పదో తరగతిలో అత్యున్నత ప్రతిభ కనబరిచిన నాయుడు మండలం నుంచి ట్రిపుల్ ఐటికి ఎన్నికైన ఏకైక విద్యార్థి కావడం హర్షణీయమన్నారు. కడప జిల్లాలోని ఆర్‌కె వ్యాలీ కళాశాలలో నాయుడుకు ప్రవేశం లభించిన్నారు. నాయుడును హెచ్ఎం తో పాటు ఇతర ఉపాధ్యాయులు విద్యార్థులు అభినందించారు. ఏలేశ్వరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నాణ్యమైన విద్యానుభవం గల ఉపాధ్యాయుల పర్యవేక్షణలో బోధించడం వల్ల ఆరో తరగతిలో తమ పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు ముందుకు వస్తున్నారని హెచ్ఎం తెలిపారు.

ఏకగ్రీవంగా సీతారామపురం ఇడిసి ఎన్నిక

ప్రజాశక్తి -తాళ్లరేవు

తాళ్లరేవు అటవీశాఖ అభివృద్ధిలో భాగంగా ఏర్పాటు చేస్తున్న ఎకో డెవలప్మెంట్ కమిటీ (ఇడిసి) ఎన్నికలు ప్రశాంతంగా సాగుతున్నాయి. కోరంగి పంచాయతీ సీతారామపురం వివేకానంద ఇడిసి ఎన్నిక శుక్రవారం ఏకగ్రీవం అయ్యింది. అటవీ శాఖ ఎఫ్ఎస్ఒ సింగం వీరభద్రరావు, ఎఫ్‌బిఒ ధనుంజయ్ రావు, సిబ్బంది వెంటపల్లి విష్ణు సమక్షంలో స్థానిక గ్రంథాలయం ఆవరణలో ఈ ఎన్నికలు నిర్వహించారు. కమిటీ చైర్మన్‌గా దడాల శ్రీనివాసరావు, వైస్ చైర్మన్‌గా కట్టా అనంతలక్ష్మి ఎన్నికయ్యారు. సభ్యులుగా పెయ్యల తాతారావు, దుప్పి లక్ష్మి, బూలా అరుణ, కోలాట వీరబాబు, కడలి భవానీ ప్రసాద్, అత్తిలి వీర వెంకట బాలకృష్ణ, వాడపర్తి చంద్రకళ, కురుపూడి గంగాభవాని, చెవల శ్రీనివాసరావు, కట్టా శమంతకమణి, గెద్దాడ లక్ష్మీ వరప్రసాద్, అద్దంకి భవాని, కాపా సీతామహాలక్ష్మి ఉన్నారు. ఈ కార్యక్రమంలో టేకుమూడి లక్ష్మణరావు, అరబరుకుల రమణ, దడాల భైరవమూర్తి, దుప్పి రాజేంద్ర ప్రసాద్, మడికి భైరవమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా ఎన్నికైన కమిటీతో ఫారెస్ట్ అధికారులు

చెత్త సేకరణపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - ఆలమూరు

గ్రామాల్లో తడి చెత్త, పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పించడం ద్వారా సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పాలని రామచంద్రపుర డివిజనల్ పంచాయతీ అధికారి, ఎంపిడిఒ ఎ.రాజు పిలుపునిచ్చారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎపిఎం ఎం.ధనరాజు అధ్యక్షతన శుక్రవారం జరిగిన డ్వాక్రా యానిమేటర్లు, సమాఖ్య సభ్యుల సమావేశానికి ఎంపిడిఒ రాజు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మండల వెలుగుశాఖ సహకారంతో అర్హులైన మహిళలందరూ డ్వాక్రా రుణాలు తీసుకోవాలని, అదేవిధంగా సక్రమంగా చెల్లించాలని ఎంపిడిఒ రాజు, ఎపిఎం ధనరాజు కోరారు. అనంతరం గ్రామాల వారీగా స్త్రీనిధి, సిఐఎఫ్, ఉన్నతి బకాయిల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికవరిని పెంచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే గ్రామాల్లో మహిళా శక్తి సంఘాలను పటిష్ట పరచాలన్నారు. ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ పథకాన్నీ ప్రజలకు చేరవేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య కోశాధికారి యర్రంశెట్టి చంద్రకళ, సిఎ ఎం.నవీన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపిడిఒ రాజును సత్కరిస్తున్నఎపిఎం ధనరాజు, విఒఎలు

ఎంపిడిఒకు ఘన సత్కారం

మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ ఎ.రాజుకు మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం సత్కరించారు. యోగా డే కార్యక్రమాలను ప్రజలలోకి వేగవంతంగా తీసుకుని వెళ్లి అవగాహన కల్పించిన సేవలకు గాను గుర్తింపుగా జిల్లా ఉత్తమ సేవాఅవార్డు కలెక్టర్ మహేష్ కుమార్, జెసి నిశాంతి చేతుల మీదుగా అందుకున్న విషయం విదితమే. దీంతో ఎపిఎం ఎం.ధనరాజు సమక్షంలో మహిళ సమాఖ్య విఓఏలు డ్వాక్రా సంఘాల నేతలు దుస్సాలువాలు కప్పి సత్కరించి అభినందించారు.

ప్రయివేటు పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలంలోని ప్రయివేటు పాఠశాలలో ఫీజులు దోపిడీ అధికంగా ఉందని దాన్ని నియంత్రించాలని రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. రామచంద్రపురం మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం మండల అధ్యక్షులు అంబటి భవాని అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఎంపి బోస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు, క్వాలిఫైడ్ ఉపాధ్యాయులు విద్యా బోధన చేస్తారని, ప్రయివేటు పాఠశాలల్లో అర్హతలు లేని ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తారని, మండల విద్యాశాఖ అధికారులు ప్రయివేటు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు వివరాలు సేకరించాలన్నారు. తరుచుగా ప్రయివేటు పాఠశాలలను తనిఖీలు నిర్వహించాలన్నారు. ఆ అధికారం ఉన్నప్పటికీ అధికారులు సద్వినియోగం చేసుకోవట్లేదని వివరించారు. మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు మాట్లాడుతూ మండలంలోని ప్రయివేటు పాఠశాలలో ఫీజులు అధికంగా వసూలు చేస్తున్నారని మండల విద్యాశాఖ అధికారులు వీటిని నియంత్రించాలని డిమాండ్ చేశారు. ప్రయివేటు పాఠశాలల్లో పుస్తకాల అమ్మకూడదన్న నిబంధనం ఉన్నప్పటికీ పుస్తకాలన్నీ ప్రయివేటు పాఠశాల లోనే విక్రయిస్తున్నారని అన్నారు. దీంతో పాటుగా దుస్తులు, బ్యాగులు, షూస్ సైతం వాళ్ల దగ్గరకు విద్యార్థులు తల్లిదండ్రులు కొనుగోలు చేయవలసి వస్తుందని వీటిని వెంటనే నియంత్రించాలని సభ్యులు ఎంఇఒ టి.వీర రాఘవరెడ్డిని ప్రశ్నించారు. దీనిక ఆయన సమాధానం ఇస్తూ త్వరలో ప్రయివేటు పాఠశాలల యజమానులతో సమావేశం ఏర్పాటు చేసి దీనిపై మాట్లాడుతామన్నారు. సమావేశంలో ఎంపిపి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఉన్నప్పటికీ అధిక శాతం తల్లిదండ్రులు ప్రయివేటు పాఠశాలలను ఆశ్రయించడంతో ఫీజులు వసూళ్ల అధికమయ్యాయని ప్రభుత్వ పాఠశాలలను ఉపయోగించుకోవాలన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ రాహుల్ మాట్లాడుతూ మంచినీటి సమస్య ఉన్న గ్రామాల్లో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ మంచినీరు అందించే కార్యక్రమం జరుగుతుందన్నారు. అయితే పలు గ్రామాల్లో జలజీవన్ మిషన్ అమలు కాలేదు అని, మంచినీళ్ల లేనిచోట అసలు పనులు ప్రారంభించలేదని పలువురు ఎంపిటిసి సభ్యులు ప్రశ్నించారు. ఇప్పటివరకు చేసిన పనులకు బిల్లులు రాకపోవడం వల్ల మిగిలిన పనులు మందకొడిగా జరుగుతున్నాయని ఆయన వివరించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ సుంకర రాంబాబు మాట్లాడుతూ కేంద్రం ఈ ఏడాది కేటాయించిన 14,300 ఇళ్లలో కొన్ని మన మండలానికి వచ్చాయన్నారు. పొజిషన్ సర్టిఫికెట్లు ఇచ్చేందుకు రెవెన్యూ శాఖ లంచాలు తీసుకుంటున్నారని వాటిని అరికట్టాలని సభ్యులు విజ్ఞప్తి చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి బోస్, పాల్గొన ఎంపిపి అంబటి భవాని తదితరులు

సమావేశానికి రాని అధికారులపై చర్యలు తీసుకోవాలి

మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలు అధికారులు విధిగా హాజరుకావాలని హాజరుకాని ఉద్యోగులపై చర్యలు చేపట్టాలని దీనిపై నోటీసులు జారీ చేయాలని మండల అభివృద్ధి అధికారి ఆశాజ్యోతికి ఎంపీ బోస్ సూచించారు. సమావేశానికి వ్యవసాయ అధికారి టివిఆర్.మణిదీప్, ద్రాక్షారం ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్ రత్న సుధ, పలు శాఖల అధికారులు, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు హాజరయ్యారు.

మరిడమ్మకు ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మరిడమ్మ అమ్మవారికి శుక్రవారం బంగారు వెండి పుష్పాలతో అర్చనలు, పూజలు చేశారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం అనంతరం పాల్గొన్న వారికి ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు ఎన్‌వి.అవధాని, శంకర్, ఐవి.ప్రసాద్ శర్మ, అసాదులు రాయి నాని, రామచంద్ర ప్రసాద్, సిబ్బంది ఎస్.రమణ, వరహాలు, శివ పాల్గొన్నారు.

నట్టల మందు పంపిణీ

ప్రజాశక్తి-గొల్లప్రోలు

మండలంలోని చేబ్రోలులో పశువుల ఆసుపత్రిలో వైద్యులు టి.ప్రశాంత్ ఆధ్వర్యంలో శుక్రవారం నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. సుమారు 1000 గొర్రెలు, మేకలకు మందు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఓదూరి కిషోర్, మల్లిపూడి వీరబాబు, ఓరుగంటి వీరబాబు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

ప్రజాశక్తి - సామర్లకోట

ప్రభుత్వం విద్యార్థుల సౌకర్యార్థం సర్వేపల్లి రాధాకష్ణ విద్యామిత్ర పేరిట యూనిఫామ్, టెస్ట్ బుక్స్, నోట్ బుక్స్‌తోపాటు తల్లికి వందనం ద్వారా ఆర్థిక ప్రయోజనం కూడా కల్పించిందని, దీన్ని సద్వినియోగం చేసుకుని ప్రతి ఒక్కరూ విద్యను అభ్యసించి మంచి ఫలితాలు సాధించాలని టిడిపి కౌన్సిలర్ బలుసు శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్లో హెడ్మాస్టర్ తోటకూర సాయిరామ కృష్ణ ఆధ్వర్యంలో పాఠశాలలో కొత్తగా చేరిన విద్యార్థులకు విద్యా మిత్ర కిట్లు పంపిణీ చేశారు. హెచ్ఎం సాయిరామకృష్ణ మాట్లాడుతూ పదో తరగతి ఫలితాల్లో మండల ఫస్ట్‌తో పాటు ట్రిపుల్ ఐటిలో కూడా పట్టణంలో తమ పాఠశాల విద్యార్థులు అత్యధికంగా మూడు సీట్లు కైవసం చేసుకున్నారన్నారు. అడ్మిషన్ల కోసం ప్రత్యేక డ్రైవ్ సాగుతోందని తెలిపారు.

దస్తావేజు పోయినది

నా క్లయింటు **యరనాగుల శ్రీహరి,** S/o. ధర్మరాజు, డో.నెం. 24-12-154, 0/8 Lane, నల్లచెరువు, గుంటూరు జిల్లా వారు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం,

నా క్లయింటు మరియు వారి కుటుంబ సభ్యుల యొక్క **ఒరిజినల్ క్రయ దస్తావేజు నెం. 4853/1955, Dt. 7-12-1955,** రాజమండ్రి సబ్ రిజిష్టర్ ఆఫీస్‌లో రిజిష్టర్ కాబడిన దస్తావేజు **ది. 10-6-2025వ** తేదీన నా క్లయింటు తన యొక్క ఆస్తిని చూడటానికి వచ్చి తిరిగి వెళ్ళుచుండగా రాజమండ్రి ప్రకాష్‌నగర్ సెంటర్‌లో పడిపోయినది. ఎంత వెతికినా కనిపించలేదు. కనుక పై తెలిపిన దస్తావేజు ఎవరికైన దొరికిన ఎడల ఈక్రింది అడ్రసుకు తెలియపర్చవలసిందిగా కోరుచున్నాము.

బి.ప్రభాకరరావు
అడ్వకేట్
డో.నెం. 44-17-17/1
అన్నపూర్ణమ్మపేట, రాజమండ్రి
సెల్: 9440916878

కోర్టు నోటీసు

మహారాజశ్రీ గౌరవ అనపర్తి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A.No.319/2024 IN O.S.No. 200/2024

BETWEEN:

పడాల సత్యనారయణ రెడ్డి, S/o. మునిరెడ్డి, టీచర్, R/o. D.No. 5-105/A, పందలపాక గ్రామం, బిక్కవోలు మండలం, తూర్పుగోదావరి జిల్లా,

...వాది (PLAINTIFF/PETITIONER)

AND

1. సిరిపరపు సురేష్ కుమార్, S/O. లేట్ అప్పారావు, బిజినెస్ R/o. D.No. 4-118, కొమరిపాలెం గ్రామం,. బిక్కవోలు మండలం, తూర్పు గోదావరి జిల్లా.
2. సిరిపరపు ప్రసన్న లక్ష్మి, W/o. సురేష్ కుమార్, గృహిణి, R/O. D.No. 4-118, కొమరిపాలెం గ్రామం, బిక్కవోలు మండలం, తూర్పు గోదావరి జిల్లా.

...ప్రతివాదులు (DEFENDANTS/RESPONDENTS)

పై నెంబర్ దావాలో వాది/పెటిషనర్ మహారాజశ్రీ గౌరవ అనపర్తి జూనియర్ సివిల్ జడ్జి, వారి కోర్టు లో వాది గామీ పై సివిల్ సూట్ I.A.No.319/2024 IN O.S. No. 200 / 2024 దావా/వాద్యం దాఖల్ చేసియున్నారు. సదరు వాద్యం లో కోర్ట్ వారు పైన వివరించిన చిరునామాకు అనేక పర్యాయములు పోస్ట్ ద్వారాను కోర్టు ద్వారాను సమన్లు పంపిచినప్పటికినీ మీరు ఉద్దేశ్యపుర్వకంగా కోర్టు సమన్లు తీసుకోకుండా తప్పించుకోనుచునారు. కావునా మీరు **ది. గం॥ 11-07-2025 సం॥ ఉదయం గం॥ 10.30 ని॥లకు** సదరు పైన వివరించిన కోర్టు నందు మీరు స్వయంగా గాని లేదా మీ లాయరు గారి ద్వారా గాని హాజరు కావలెను లేని యెడల కోర్టు వారు మీ పరోక్షంన వాద్యం తిర్మానించదరు.

(గౌరవ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

జె.నాగేశ్వరరావు
అనపర్తి వాది తరుపు న్యాయవాదులు
తేది. 26-06-2025 సెల్: 8074054030

In the Court of the Prl. Senior Civil Judge at Rajamahendravaram
I.P. No. 15/2025
In the Court of the Vacation Civil Judge, Rajamahendravaram
I.P. No. 2/2025

Between:

Chintala Rajesh, S/o. Rangarao, aged 41 years, R/o. Flat No. 102, D.No. 72-10-17, Sprint Ananya Apartments, Lalacheruvu, Subbarao nagar, Rajamahendravaram Urban, E.G.Dist., - 533101. ***...Petitioner***

AND

1. The Aditya Birla Capital, rep. by its Credit Manager, Rowthumansion, Danavaipeta, Rajahmundry - 533103, E.G.Dist.,

2. The (Flexloans) Epimoney Private Limited, rep. by its Credit Manager, Office Address: 7th Floor, South Annexe, Tower 2, One World Centre, 841, Senapati Bapat Marg, Lower Parel, Mumbai - 400013.

3. Piramal Capital & Housing Finance Limited, rep. by its Credit Manager (PCHF4, 1674P, Surya Prime 36, 10/25/1 & 36/12, stadium Rd, Near Sabbarapu Street, Innespeta, Rajamahendravaram, Andhra Pradesh 533101.

4. Tata Capital Housing Finance Limited, rep. by its Credit Manager, Door No. 86-1-9, 2nd Floor, B Square, Plot No. 36, J.N.Road, Rajahmundry 533101.

5. IIFL Finance Limited, rep. by its Credit Manager, Door No. 46-9-2, 2nd Floor, Bypass Road, Jampeta, Rajahmundry - 533103.

6. The Bajaj Finserv, rep. by its Credit Manager, Beside of Canara Bank, Innespeta Branch, Innespeta, Routhu Mansion, beside land, Rajahmundry - 533101.

7. The In-charge, Credit Card Division, HDFC bank, D.No. 73-133/1, AVA Road, Rajahmundry 533101.

8. Sr Mohammad Abdul Sattar, S/o. Mohammad Hazi Abdul Waheb, aged 41, D.No. 3-95, Near Sivalayam temple, Nidamarru Mandalam, Kovvidi, W.G.Dist.,

9. Smt. Koosetti Lakshmi, W/o. Ramayya, aged 39, D.No. 72-40-2, Narayanapuram, Lalacheruvu, Rajamahendravaram - 533101.

10. Smt. Rongala Rajeswari, W/o. Ravikiran, aged 35, D.No. 72-38-4, Near Narayanapuram Park, Lalacheruvu, Rajamahendravaram - 533101.

11. Darapureddy Anand Kumar, S/o. Nageswara Rao, Aged 39, D.No. 6-2-129/5, Flat No. 203, 2nd Floor, Pawan Teja Residency, Surya College Road, Jangareddygudem - 534447.

12. Darapureddy Narendrababu, S/o. Nageswara Rao, aged 37, D.No. 6-2-129/5, Flat No. 203, 2nd Floor, Pawan Teja Residency, Surya College Road, Jangareddygudem - 534447.

...Respondents

పై గ్రంథములో పిటీషనరు/ డెటరు తనకు గల అప్పులు చెల్లించు శక్తి లేదని ఇన్సాల్వెంటుగా/ దివాళాదారుగా డిక్లేరు చేయమని కోరుచూ పై పిటీషను దాఖలు చేసియున్నారు. కావున పైన తెలిపిన రెస్పాండెంట్లుకు గాని, ఎవరికైనా పై గ్రంథములో ఏమైనా అభ్యంతరములు ఉన్న ఎడల **ది. 10-7-2025వ తేదీన** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని **ఉదయం గం॥ 10.30 ని॥లకు** హాజరై వారికి గల అభ్యంతరములు పై కోర్టు వారి ఎదుట మనవి చేసుకోవలెను. కావున ఎల్లరుకు తెలియపర్చడమైనది.

పి.నటరాజేశ్వరరావు
శ్రీమతి పి.రజిని
రాజమండ్రి అడ్వకేట్స్, రాజమండ్రి
27-6-2025 సెల్: 8886640023